www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

సంపుటి:02 సంచిక:41, శుక్రవారం, 01.12.2023

# పోల్స్ కాంగ్రెస్ వైపే..

## ఫుల్ మెజార్టీపై నో క్లారిటీ

- హంగ్ కు అవకాశం ఉందన్న మరికొన్ని సంస్థలు
- గెలుపుపై ధీమాగా హస్తం పార్టీ
- సంబురాలు షురూ చేసుకోవాలని రేవంత్ పిలుపు
- ఎగ్జిట్ పోల్స్ ను నమ్మమన్న కేటీఆర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. మెజార్టీ సంస్థలు హస్తం పార్టీ వైపే మొగ్గు చూపగా.. కొన్ని సంస్థలు మాత్రం హంగ్ వస్తుందని తేల్చి చెప్పాయి. ఎగ్జిట్ పోల్స్ చూసుకొని కాంగ్రెస్ లీడర్లు సంబురాలు చేసుకుంటున్నారు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం తాము ఈ ఎగ్జిట్ పోల్స్ పట్టించుకోమని చెప్పారు. కాంగ్రెస్ కు మెజార్టీ వచ్చే అవకాశం ఉంది కానీ.. అదే సమయంలో హంగ్ అసెంబ్లీ అంచనాలను కూడా తోసిపుచ్చలేమని ఏబీపీ సీఓటర్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ లో స్పష్టమయింది. కాంగ్రెస్ పార్టీకి 49 నుంచి 65 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉందని తేలింది. అదే సమయంలో భారత రాష్ట్ర సమితికి 38 నుంచి 54 సీట్లు వచ్చే అవకాశం ఉంది. భారతీయ జనతా పార్టీ కూటమికి మూడు నుంచి 13 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఇతరులు 5 నుంచి 9 స్థానాల్లో గెలుస్తారు. ఇతరుల్లో మజ్లిస్ పార్టీ కూడా ఉంది.

ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 40.7 శాతం ఓట్లు వస్తాయి. అంటే గత ఎన్నికలతో ఓటింగ్ పర్సంటేజీ దాదాపుగా 12.4 శాతం పెరుగుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 28.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. భారత రాష్ట్ర సమితికి ఏకంగా 8.1 శాతం ఓట్లు తగ్గబోతున్నాయి. ఆ పార్టీకి 38.8 శాతం వరకూ ఓట్లు వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 46.9 శాతం ఓట్లు వచ్చాయి. భారతీయ జనతా పార్టీ ఓట్ల శాతం పరంగా భారీగా లబ్ది పొందుతోంది. గత ఎన్నికల్లో కేవలం ఏడు శాతం ఓట్లే ఆ పార్టీకి వచ్చాయి. కనీ ఈ సారి మాత్రం ఏకంగా 17శాతం ఓట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ లో వెల్లడయింది. ఏకంగా 9 శాతం ఓట్లు బీజేపీకి పెరుగుతాయి. ఇతర పార్టీలకు వచ్చే ఓట్ల శాతం ఈ సారి బాగా తగ్గిపోయింది. గత ఎన్నికల్లో ఇతరులకు 17.8 శాతం ఓట్లు రాగా ఈ సారి ఆ శాతం కేవలం 4.5 శాతానికి పడిపోతుందని తేలింది.

మార్జినల్స్ ఇవ్వకుండా ఖచ్చితంగా సీట్ల ప్రొజెక్షన్ అంచనా వేయాలంటే.. హంగ్ వస్తుందని ఏబీపీ సీఓటర్ ఎగ్జిట్ పోల్ చెబుతుంది. అయితే కాంగ్రెస్ పార్టీ సాధారణ మెజార్టీకి చాలా దగ్గరగా వస్తుంది. కాంగ్రెస్ పార్టీకి 57 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికలతో పోలిస్తే 38 సీట్లు ఎక్కువ. బీఆర్ఎస్ పార్టీ 42 సీట్లను కోల్పోయి 46 దగ్గర స్థిరపడుతుంది. బీజేపీ ఒకటి నుంచి ఎనిమది స్థానాలకు పెరుగుతుంది. అదర్స్ కు ఏడు సీట్లే వస్తాయి. ఆ ఏడూ మజ్లిస్ కే వచ్చే చాన్స్ ఉంది. ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ఫలితాలు రెండు విధాలుగా వచ్చే అవకాశం ఉంది.

**ప్రజల్లో అధికార వ్యతిరేకత ఉన్నప్పుడు**

తెలంగాణ ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉంది. ఈ సందర్భంగా అధికార వ్యతిరేకత ఉందని ఎగ్జిట్ పోల్స్ లో వెల్లడయింది. ఈ అధికార వ్యతిరేకత తీవ్రంగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి 67 నుంచి 79 సీట్ల వరకూ లభించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పరిస్థితి 29 నుంచి 41 సీట్లకు పరిమితమవ్వొచ్చు. బీజేపీకి నాలుగు నుంచి ఎనిమిది సీట్లు, ఇతరులకు మూడు నుంచి ఏడు సీట్లు వరకూ వస్తాయి. అంటే అధికార వ్యతిరేకత బాగా ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి ఊహించనంత మెజార్టీ వచ్చే అవకాశం ఉంది.

**ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలత ఉంటే**

తెలంగాణ ప్రభుత్వం తమకు ప్రజల్లో సానుకూలత ఉందని నమ్మకంతో ఉంది. ఎగ్జిట్ పోల్స్ లో అలాంటి వాతావరణ కనిపించకపోయినా.. ఓటర్లు చివరి క్షణంలో మనసు మార్చుకుని ఉంటే.. తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్ మరోసారి ఏర్పడుతుంది. కానీ.. అదీ అత్తెసరు మెజార్టీ లేదా హంగ్ ద్వారా మాత్రమే. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకీ40 నుంచి 52 స్థానాలు వస్తాయి. బీఆర్ఎస్ పార్టీకి 54 నుంచి 66 స్థానాలు వస్తాయని అంచనా. బీజేపీకి ఏడు నుంచి 11 సీట్లు లభిస్తాయి.

**చాణక్య..**

| | |
|---|---|
| బీఆర్ఎస్ | 23 – 31 |
| కాంగ్రెస్ | 67 – 78 |
| బీజేపీ | 06 – 09 |
| ఎంఐఎం | 06 – 07 |

**ఆరా ఎగ్జిట్ పోల్స్..**

| | |
|---|---|
| బీఆర్ఎస్ | 41- 49 |
| కాంగ్రెస్ | 58 – 67 |
| బీజేపీ | 05 – 07 |
| ఎంఐఎం | 7 – 9 |

**పోల్ ట్రెండ్స్ అండ్ స్ట్రాటజీస్**

| | |
|---|---|
| బీఆర్ఎస్ | 35-40 |
| కాంగ్రెస్ | 65-68 |
| బీజేపీ | 07-10 |
| ఇతరులు | 06-09 |

**C-PAC**

| | |
|---|---|
| బీఆర్ఎస్ | 41 |
| కాంగ్రెస్ | 65 |
| బీజేపీ | 4 |
| ఎంఐఎం | 5 |




# ఎగ్జిట్ పోల్స్ అన్ని తప్పే

- అంచనాలకు భిన్నంగా ఫలితాలు వస్తాయి
- 100 శాతం అధికారంలోకి వస్తామని ధీమా
- ఒక్క సంస్థ మాత్రమే సరిగా చెప్పింది
- ఈసారి 80కి పైగా స్థానాల్లో గెలుపు: మంత్రి కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా.. తెలంగాణ ఫలితాలు వస్తాయని మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 2018లో బీఆర్ఎస్కు 50 స్థానాల కంటే ఎక్కువ స్థానాలు చెప్పలేదని గుర్తుచేశారు. అప్పుడు ఫలితాలు ఎలా వచ్చాయో ప్రజలే చూశారన్నారు. ఈసారి కూడా రాష్ట్రంలో 100 శాతం అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 2018లో ఎగ్జిట్ పోల్స్లో ఒక్క సంస్థ మాత్రమే సరిగా చెప్పిందని పేర్కొన్నారు. 2018లోనూ టీఆర్ఎస్(బీఆర్ఎస్) ఓడిపోతుందని చాలా సంస్థలు చెప్పాయన్నారు. అప్పుడు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు అన్నీ తప్పాయని గుర్తుచేశారు. అప్పుడు ఫలితాలు ఎలా వచ్చాయో.. ఈసారి కూడా అలాంటి ఫలితాలే వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎగ్జిట్ పోల్స్ తమకు వ్యతిరేకంగా ఉండటం ఇదే తొలిసారి కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈసారి 80కి పైగా స్థానాలు వస్తాయని అనుకున్నామని.. కానీ 70 వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్కు అంత శాస్త్రీయ ఉందని అనుకోవట్లేదని చెప్పారు. పోలింగ్ జరుగుతుండగానే ఎగ్జిట్ పోల్స్ సర్వే జరుగుతుందని వెల్లడించారు. ఎగ్జిట్ పోల్స్ చూసి కార్యకర్తలు ఆందోళన చెందవద్దని మంత్రి కేటీఆర్ సూచించారు. '2018లో ఎగ్జిట్ పోల్స్లో ఒక్క సంస్థ మాత్రమే సరిగా చెప్పింది. 2018లోనూ టీఆర్ఎస్ ఓడిపోతుందని చాలా సంస్థలు చెప్పాయి. 2018లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు అన్నీ తప్పాయి. ఎగ్జిట్ పోల్స్ మాకు వ్యతిరేకంగా ఉండటం ఇదే తొలిసారి కాదు. 80కి పైగా స్థానాలు వస్తాయని అనుకున్నాం.. కానీ 70 వస్తాయి. ఎగ్జిట్ పోల్స్కు అంత శాస్త్రీయత ఉందని అనుకోవట్లేదు. పోలింగ్ జరుగుతుండగానే ఎగ్జిట్ పోల్స్ సర్వే జరుగుతుంది. ఎగ్జిట్ పోల్స్ చూసి కార్యకర్తలు ఆందోళన చెందవద్దు. ఏ ఎగ్జిట్ పోల్స్ వూహించని విధంగా ఫలితాలు ఉంటాయి.' కేటీఆర్, మంత్రి

ఓటర్లు ఇంకా పోలింగ్ కేంద్రాల్లో ఉన్నారని మంత్రి కేటీఆర్ తెలిపారు. డిసెంబర్ 3న 70 కంటే ఎక్కువ స్థానాలు బీఆర్ఎస్ పార్టీకు తప్పక వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ను ప్రజలు నమ్మొద్దని భరోసా కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు గందరగోళానికి గురి కావొద్దని సూచించారు. తెలంగాణలో 100 శాతం అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసినప్పటి నుంచి రెండు నుంచి మూడు నెలల పాటు కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు



# ప్రభుత్వ విధానాన్ని విమర్శించడం కాదు

- ఓటు ముఖ్యమని తెలుసుకోండి
- లేదంటే విమర్శించే అవకాశం రాదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఓటు హక్కు వినియోగించుకున్న కిషన్ రెడ్డి కుటుంబసభ్యులు

..మిగతా 3 లో



# పార్టీ కండువాలతో పోలింగ్ కేంద్రాలకు ఎమ్మెల్యేలు

..మిగతా 3 లో

## మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిపై కేసు నమోదు

# డిసెంబర్ 3న ప్రజల తెలంగాణ

- బీఆర్ఎస్ కు 25 కంటే ఒక్క సీటు కూడా దాటదు
- కేటీఆర్ త్వరలోనే అమెరికాకు
- తెలంగాణ ప్రజల చైతన్యం మీద నాకు పూర్తి నమ్మకం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

డిసెంబరు 3న ప్రజల తెలంగాణ ఆవిష్కృతమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణకు పదేళ్లుగా పట్టిన పీడ తొలగిపోనుందన్నారు. ఓటమి ఖాయమని తెలిసినప్పుడే కేసీఆర్ నియోజకవర్గం మార్చారని ఆరోపించారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ చైతన్యవంతమైందని కామారెడ్డి ప్రజలు నిరూపించారని రేవంత్‌రెడ్డి హర్షించారు. తెలంగాణ ఉద్యమంలో డిసెంబరు 3కు ప్రత్యేక స్థానం ఉందని.. ఆరోజే శ్రీకాంత్‌చారి తుదిశ్వాస విడిచారన్నారు. శ్రీకాంత్‌చారి ఘటనతోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని గుర్తు చేశారు. డిసెంబరు 3న దొరల తెలంగాణ అంతమై.. ప్రజల తెలంగాణ ఆవిష్కృతమవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రజల చైతన్యం మీద తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు.

బీఆర్ఎస్ పార్టీకు 25 కంటే ఒక్క సీటు కూడా దాటదని.. సునామీ వస్తే.. గడ్డపారలే కొట్టుకుపోతాయి.. గడ్డిపోచ ఓ లెక్కా అంటూ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. గతంలో పోలింగ్ ముగియగానే కేసీఆర్ వచ్చేవారు.. కానీ ఓటమి ఖాయమని తెలిసే కేసీఆర్ ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ కూడా త్వరలోనే అమెరికాకు వెళ్లిపోతారని జోస్యం చెప్పారు. అధిష్ఠానం సూచన ప్రకారం సీఎల్పీ సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సీఎల్పీలో చర్చించి ప్రభుత్వ ఏర్పాటు తేదీని నిర్ణయిస్తామని తెలిపారు. ప్రొఫెసర్ కోదండరామ్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఎంఐఎం ప్రస్తుతం బీజేపీతో ఉందని.. అందుకే మైనార్టీలను ప్రభుత్వంలో కలుపుకొని

..మిగతా 3 లో

## ఎన్నికల్లో ఆదరించిన
# ప్రజలకు విప్లవ జేజేలు

■ సీపీఐ (యంయల్) లిబరేషన్ అభ్యర్థి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా



**పాలకుర్తి, విశాల భారతి:** పాలకుర్తి నియోజకవర్గం నుంచి సీపీఐ (యంయల్) లిబరేషన్ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు ఓట్లేసి అండగా నిలిచిన ప్రజానీకానికి విప్లవ జేజేలు తెలుపుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి మామిండ్ల రమేష్ రాజా తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఉదయం 50 నెంబర్ పోలింగ్ బూత్ లో రమేష్ రాజా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పాల కుర్తి, రాయపర్తి, పెద్ద వంగర, తొర్రూరు, దేవరుప్పుల మండలాల్లోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సం దర్భంగా మామిండ్ల రమేష్ రాజా మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కులం, మతం, ప్రాంతం, డబ్బుతో పాటు మద్యం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేశాయని, ఆధిపత్య సామాజిక శక్తుల మధ్య పోరాటం నడిచిం దని అన్నారు. మతతత్వ, అవినీతి, దోపిడి శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు గుణపాఠం చెప్పేలా పోలింగ్ జరిగిందని వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఎర్రజెండా బిడ్డను, సీపీఐ (యంయల్) లిబ రేషన్ పార్టీని ఆదరించి ప్రజలు ఓట్లు వేశారని, తమకు గౌరవప్రదమైన ఓట్లు లభిస్తాయని తెలిపారు. గతం కంటే ప్రస్తుత ఎన్నికల్లో తమకు రెట్టింపు ఓట్లు వస్తా యని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు నక్షత్రాల జెండా గుర్తుకు ఓట్లేసి ప్రజా ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించిన వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక శక్తులకు విప్లవ అభివందనాలు తెలియజేస్తున్నట్లు రమేష్ రాజా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జీడి సోమయ్య, నాయకులు అనంతోజు రజిత, దుస్సా శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




## బెంజ్ ప్రెస్ పోటీల్లో బంగారు పథకం

**భద్రాచలం, విశాల భారతి:** ఈనెల 24 నుంచి 28 వరకు బెంగుళూరు లో జరిగిన జాతీయ స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాచలం సిటీస్టల్ జిమ్ కు చెందిన క్రీ డాకారుడు మహమ్మద్ అబ్బాస్ కు బంగారు పతకం, మరొక క్రీడాకారుడైనటువంటి మహంతి వెంకట కృష్ణాజి( సుధా జ్యువెలర్స్ అధినేత ) ఆరవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు .జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారులు గతంలో కూడాజిల్లా రాష్ట్ర జాతీయస్థాయి పోటీలలో కూడాఎన్నోసార్లు సత్తా చాటినట్లు తెలిపారు. క్రీడాకారులు మాట్లాడుతూ కోచ్ జివి రామిరెడ్డి ఇచ్చినా కటోర శిక్షణ వల్లనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారులను పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, క్రీడా సంఘాల నాయకులు, పలువురు రాజకీయ నాయకులు,పట్టణ ప్రముఖులు,గ్రీన్ భద్రాద్రి టీం వా రు,భద్రాచలం పట్టణ ప్రముఖ సంఘ సేవకులు, గాదె మాధవరెడ్డి, భద్రాచలం గోల్డ్ యూనియన్ ప్రెసిడెం ట్, ఇజ్జాడ ప్రభాకర్ చిట్టి తదితరులు క్రీడాకారులను అభినందించారు.





## కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

**ఆర్మూర్, విశాల భారతి:** నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బిజెపి, బిఆ ర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆయన సతీమణి అనన్యతో మామిడిపల్లిలో, బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు రజిత రెడ్డి కు మార్తెలు అనౌశిక రెడ్డి, అనన్య రెడ్డి ఓటు హక్కును వి నియోగించుకున్నారు. జీవన్ రెడ్డి కుమార్తెలు మొట్ట మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్నా రు. బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేష్ రెడ్డి ఆయన



సతీమణి రేవతి రెడ్డి కూతురు సుచరిత రెడ్డితో కలిసి అంకాపూర్ లో ఓటు వేశారు.



## మేడ్చల్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

**ఓటు హక్కు వినియోగించుకున్న తోటకూర వజ్రేష్ యాదవ్ దంపతులు**

**మేడిపల్లి, విశాల భారతి:** శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం జరుగుతున్న ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ సతీమణి లక్ష్మి,కా ర్పోరేటర్లు పోగుల నర్సింహ్మారెడ్డి,తోటకూర అజయ్ యాదవ్ లతో కలిసి బోడుప్పల్ కార్పోరేషన్ లోని పల్లవి మోడల్ పాఠశాల లో ఓటు ను వినియోగిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాధారణ పౌరుడిలా క్యూ లైన్ లో నిలబడి ఓటు వేశారు వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం ప్రజ లపై తనకు పూర్తి నమ్మకం ఉందని,భారీ మెజారిటీతో గెలిపిస్తారని తెలిపారు.ఓటు హక్కు వినియోగించుకు న్న వారిలో మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పుగళ్ళ ప్రశాంత్,సింగిరెడ్డి రాజు రెడ్డి,తోటకూర నవీన్ యాదవ్ పాల్గొన్నారు.



## చైతన్యం నింపిన యువకులు

**తొర్రూరు విశాల భారతి:** పాలకుర్తి నాంచారి మదూర్ గ్రామంలోని గుడిబండ తండాలోని యువకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజల్లో చైతన్య నింపడం కోసం ని యోజకవర్గం గుడిబండ తండా తండాకు చెందిన యువకులు ఓటింగ్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో తొర్రూర్ మండల యూత్ అధ్యక్షులు బానోత్ అభిరాం నాయక్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవ ర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హనుమాండ్ల యశస్విని రెడ్డి గారు భారీ మెజారిటీతో విజయం సాధించబోతుంది అని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్క వినియోగిం చుకోవాలని అన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలని ప్రతి ఒక్కరు ఆకాంక్షించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ నాయకులు పాల్గొన్నారు.





## కొత్త ఓటర్ల స్పందన

**ఓటును వినియోగించుకున్న అభ్యర్థులు**

**ఆమనగల్లు, విశాల భారతి :** కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, తన సతీమణి మాధవితో కలిసి తలకొండపల్లి మండలం లోని తన సొంత గ్రామమైన ఖానాపూర్ లో ఉదయం పోలింగ్ బూత్ నెంబర్ 36లో తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కడ్తాల్ మండలంలోని చల్లంపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జైపాల్ యాదవ్ ఓటును వినియోగించు కున్నారు. ఆమనగల్లులో బీజేపీ అభ్యర్థి ఆచారి తన ఓటును వినియోగించుకున్నారు. ఇతర ప్రాంతాలలో నివాసం ఉంటున్న ఓటర్లు తమ ఓటు హక్కు విని యోగించుకోవడం కోసం భారీగా తరలివచ్చారు.



ఉదయం పోలింగ్ కేంద్రాలకు తక్కువ సంఖ్యలో చే రుకున్న ఓటర్లు మధ్యాహ్నం ఓటు వేసేందుకు క్యూ కట్టారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువత నుంచి భారీ స్పందన లభించింది. ఈ సం దర్భంగా కొత్తగా ఓటు హక్కు పొందిన యువత మాట్లాడుతూ.. తొలిసారిగా ఓటేయడం అద్భుతంగా అనిపించిందన్నారు.




## జంట కార్పోరేషన్ లలో ప్రశాంతంగా ఎన్నికలు

- ■ ఓటు హక్కు వినియోగించుకున్న నవ ఓటర్లు
- ■ పూర్తి సహకారం అందించిన మేడిపల్లి పోలీసులు
- ■ విజన్ పార్మసీ కాలెజీలో సౌకర్యం లేక వెను దిరిగిన ఓటర్లు
- ■ పట్టించుకోని ఎన్నికల అధికారులు

**మేడిపల్లి, విశాల భారతి:** శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిదిలోని జంట కార్పోరేషన్లు బోడుప్పల్,ఫీర్జాది గూడ లో పౌరులు క్యూ లైన్ లో నిలబడి ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ హక్కు వినియోగించు కున్నారు... నవ ఓటర్లు ఉత్సాహంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేడిపల్లి పోలీసులు భారీ స్థాయిలో సీఆర్పిఎస్,కేంద్ర బలాగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడంతో వారికి ఓటర్లు సహకరిస్తున్నా రు.ఓటర్లకు పోలీసులు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారు. బోడుప్పల్ పరిధిలోని విజన్ పార్మసీ కాలెజీలో ఎన్నికల అధికారులు పూర్తిగా స్థాయిలో సౌకర్యాలు కల్పించక పోవడంతో ఓటర్లు క్యూలైన్ లో నిలబడి విసుగుతో ఓటు వేయ్యకుండా వెనుదిరిగారు.



## ఓటు హక్కును వినియోగించుకున్న
# కల్వారీ మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్

**బెల్లంపల్లి, విశాల భారతి :** బెల్లంపల్లి మండలం సోమగూడెం పోలింగ్ కేంద్రంలో బెల్లంపల్లి కల్వరీ మినిస్ట్రీస్ చర్చ్ పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారూన్ తమ కుటుంబంతో సహా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమగూడెం పోలింగ్ కేంద్రానికి ఉదయమే పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారూన్ వారి కుటుంబంతో సహా చేరుకోగా క్యూ లైన్ లో ని లుచున్నారు. అక్కడ ఉన్న ఓటర్లు క్యూ లైన్ లో వద్దని ముందు వెళ్లి ఓటు వేయాలని కోరగా ఓటు హక్కు వినియోగం అందరికి సమానమని, అలా వద్దని క్యూ లైన్ లోనే ఉండి తమ ఓటు హక్కును వినియోగించు కొని ఆదర్శంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్న ఓటు హక్కును వినియోగించుకోవాలని సిస్టర్ షారోన్ పిలుపు నిచ్చారు.





## ఓటు హక్కు వినియోగించుకున్న వివిద పార్టీల ప్రజా ప్రనిధులు, నాయకులు

**మేడిపల్లి,విశాల భారతి:** శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం జరుగుతున్న ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం ఎం సీపీఐ యూ అభ్యర్థి ముడి మార్టి న్,జంట కార్పోరేషన్ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి,సా మల బుచ్చిరెడ్డి,కార్పోరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్, బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీ వరెడ్డి, మేడిపల్లి కార్పొరేషన్ కార్పొరేటర్లు మేడ్చల్ ని యోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప ఓటు హక్కును వినియోగించుకున్నారు.



## పీర్జాదిగూడలో ఎలక్షన్ విధుల
# సిబ్బందికి పురుగుల అన్నం

**మేడిపల్లి,విశాల భారతి:** మేడ్చెల్ జిల్లా మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఓల్డ్ విలేజ్లో ఎలక్షన్ డ్యూటీలలో విధులు నిర్వహిస్తున్న ఎలక్షన్ సిబ్బందికి పురుగుల అన్నం పంపింని చేసిన అధికారులు పురుగుల అన్నం తిని కొందరు అస్వస్థకు గురి అయ్యారంటు వార్తలు.. పిర్జాదిగూడ కమిషనర్ ని వివరణ అడగగా నిజమే అని ఒకరు తినే అన్నంలో పురుగులు వచ్చాయని విచారణ చే స్తున్నామని ఎలక్షన్ విధులలో ఉన్న కమిషనర్ నమ్య నాయక్ అన్నారు.






## బోడుప్పల్ లో
# వైన్ షాపుల వద్ద సందడి

**బోడుప్పల్ ,విశాల భారతి:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో గత రెండు రోజులనుండి మందు షాపులు బంద్ ఉండి ఈ రోజు ఎన్నికలు ముగియాడంతో మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ లో సాయంత్రం 6 గంటలకు మందు షాపులు తెరుచుకున్నాయి.. దీంతో మందుబాబులు షాపుల వద్ద ఎగబడ్డారు. మందు షాపులు ఉన్న ప్రాంతాలంతా ఒక్కసారిగా రాద్దిగా అయ్యాయి.



## కాంగ్రెస్అభ్యర్థి వర్సెస్ బీఆర్ ఎస్ అభ్యర్థి

- ■ బోడుప్పల్ లో అరుదైన సన్నివేశం ఎన్నిక నేపథ్యంలో స్నాహంగా స్నేహంగా పలకరించుకున్న మల్లా రెడ్డి, వజ్రెష్ యాదవ్.

**బోడుప్పల్, విశాల భారతి:** బోడుప్పల్ లో అరుదైన సంఘటన జరిగింది, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోడుప్పల్ లో ఓ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి వజ్రెష్ యాదవ్ బీ ఆర్ ఎస్ అభ్యర్థి మల్లా రెడ్డి ఏదురేదురు కావడంతో ఆప్యాయంగా పలకరించుకు ని ఫోటోలకు ఫోజిచ్చారు. కార్యకర్తలు కూడా ఒకరిని ఒకరు పలకరించుకున్నారు. ఎప్పుడు ఒకరిపై ఒకరు దుశించుకునే సంఘటనలే ప్రజలు చూసారు.. కానీ ఈ అరుదైన సంఘటనతో ప్రజలు అశ్చర్యపోయారు.

## తెలంగాణలో మార్పు రాబోతుంది

**కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల గోపినాథ్**

**శాలిగౌరారం, విశాలభారతి:** తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలోని జరిగిన ఎన్నికల్లో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల గోపీనాథ్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వేముల గోపీనాథ్ మాట్లాడుతూ తెలంగాణ లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ,మార్పు కావాలని ప్రజలు ప్రజాస్వామిక వాదులంతా ముక్తకంఠంతో ఉన్నారని ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును




వినియోగించుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు తలగ కుండా భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుని మార్పు వైపు ఉండాలి అన్నారు.



## బాల్కొండ నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్

**సాయంత్రం ఐదు వరకు**
**71% పోలింగ్ నమోదు**

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలంలో గురువారం బాల్కొండ ఎమ్మెల్యే స్థానానికి జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు తొమ్మిది గంటల వరకు మంద కోడీగా సాగాయి. ఏడు గంటలకు 7.2% గా నమోదైన పోలింగ్ 11 గంటల వరకు 24.7% కు పెరిగింది. మధ్యాహ్నం 1గంట వరకు 38%, మూడు గంటల వరకు 62 ఎన్నికలు ముగిసే సమయం ఐదు గంటల వరకు 71 % వరకు పెరిగింది. సాయంత్రం ఐదు గంటలకు ఎన్నికల సమయం ముగియడంతో సమయానికి ఓటు వేసేందుకు వచ్చిన వారికే ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చారు. సమయం దాటిన తరువాత వచ్చిన వారిని ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వలేదు.పోలింగ్ సరళిని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ అభ్యర్థులు ముత్యాల సునిల్ కుమార్,ఏలేటి అన్నపూర్ణమ్మ పరిశీలించారు.



## జిల్లాలో తొమ్మిది స్థానాలు మావే

**రాష్ట్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాం....**

**బాల్కొండ, విశాల భారతి:**నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సరళిని పరిశీలించిన ఆయన భీమ్‌గల్ లో మీడియాతో మాట్లాడార.. తొమ్మిది స్థానాల్లో ఏడు స్థానాలు మంచి మెజారిటీతో రెండు స్వల్ప మెజారిటీతో గెలుస్తున్నామని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో తనకు 55 పైబడి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనపై, తన కుటుంబంపై ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన ప్రజలు పట్టించుకోకుండా తన వైపే నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో 119 సీట్లకు గాను 80 సీట్లను బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ పథకాలు గెలుపుకు దోహదం చేశాయని,మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలకు మంచి సేవలు అందజేస్తామని పేర్కొన్నారు. గెలిచిన తరువాత నేను కేసీఆర్ సైనికుడిలా ఉంటానని మంత్రి తెలిపారు. ఆయన వెంట మధు శేఖర్,మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత,కన్నె సురేందర్, మల్లెల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## పార్టీ కండువాలతో పోలింగ్ కేంద్రాలకు ఎమ్మెల్యేలు

**మంత్రి ఇంద్రకరణ్రెడ్డిపై కేసు నమోదు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ పలువురు ఎమ్మెల్యేలు పార్టీ కండువాలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లడం వివాదానికి దారితీసింది. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ వి.వి మందిర్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలోకి ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఆయన అనుచరులు పార్టీ కండువాలతో ప్రవేశించారు. కండువాలు తొలగించాలని సీఐ చెప్పడంతో.. ఎమ్మెల్యే సైదిరెడ్డి సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ మాటలను ఎమ్మెల్యే బేఖాతరు చేయడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సైతం ఇలాగే చేశారు. నెన్నెల మండలం జెండా వెంకటాపూర్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఆయన.. పార్టీ కండువాతో పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ఎమ్మెల్యే గులాబీ కండువాతో వచ్చి ఓటు వేసినా ఎన్నికల సిబ్బంది ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడం విమర్శలకు దారితీసింది. ఇదే విషయంలో



మంత్రి ఇంద్రకరణ్రెడ్డిపై కేసు నమోదైంది. ఎల్లపెల్లిలో గులాబీ కండువాతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఆయన ఓటు వేశారు. దీంతో ఎన్నికల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంత్రిపై కేసు నమోదైంది



## కోర్సులో సీట్లు భర్తీ

- ఎంపికైన విద్యార్థుల లిస్ట్ విడుదల
- కన్వీనర్ సీట్లు 6894 గాను 5912 సీట్లు భర్తీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించినా లా సెట్ లో భాగంగా ఎల్ఎల్‌బీ మూడు ,ఐదేళ్ల కోర్సు తో పాటు ఎల్ఎల్ఎం కోర్సుల సీట్ల కేటాయింపు పొందిన విద్యార్థుల లిస్టును టీఎస్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ .పి.రమేష్ బాబు వెల్లడించారు . ఈ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద అందుబాటులో ఉన్న మొత్తం 6894 సీట్లు కాగా వెబ్ ఆప్షన్‌లను 12835 మంది అభ్యర్థులు వినియోగించుకోగా, అందులో మొదటి దశ కౌన్సెలింగ్‌లో 5912 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. సీటు పొందిన అభ్యర్థులు సంబంధిత కళాశాలలో ఫీజును , ఒరిజినల్ సర్టిఫికెట్లు శుక్రవారం నుండి 5 డిసెంబర్ వరకు చెల్లించాలని సూచించారు . డిసెంబర్ నాలుగవ తేదీ నుండి క్లాసులు ప్రారంభమవుతాయని కన్వీనర్ తెలిపారు .

## కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టి చరిత్ర సృష్టిస్తారు

- రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ను ఆశీర్వదిస్తారు
- ప్రశాంతంగానున్న రాష్ట్రంలో కాంగ్రెస్ చిచ్చు
- ప్రజలు కాంగ్రెస్‌కి తగిన గుణపాఠం చెప్పనున్నారు
- ఎమ్మెల్సీ కవిత

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ను ఆశీర్వదిస్తారని.. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టి చరిత్ర సృష్టించబోతున్నారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించిన కవిత.. ప్రజలు కాంగ్రెస్కు తగిన గుణపాఠం చెప్పనున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రాబోతుందని.. ఎమ్మెల్సీ కవిత ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కీలక ఘట్టానికి తెరపడిందని.. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టి చరిత్ర సృష్టించబోతున్నట్లు పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు చిచ్చుపెట్టాలని ప్రయత్నించారని మండిపడ్డారు. ప్రజలపై తమకు నమ్మకం ఉందని.. కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పనున్నారని ధీమా వ్యక్తం చేశారు.సంపూర్ణ మెజార్టీతో బీఆర్ఎస్ అధికారం చేపట్టబోతోందని కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారని



తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలను ప్రజలు నమ్మబోరని.. కేసీఆర్ వెంటే తెలంగాణ సమాజం ఉందని బుజువు చేయబోతున్నరన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ముగిసింది. చెదురుమదురు ఘటనల మధ్య రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 63.94 శాతం పోలింగ్ నమోదైంది. సరిహద్దులోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగియగా.. మిగిలిన 106 నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం 2,290 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అందులో 2068 మంది పురుషులు, 221 మంది మహిళలు కాగా.. ఒక ట్రాన్స్జెండర్ ఉన్నారు.బీఆర్ఎస్ మొత్తం 119 స్థానాల్లో పోటీ చేయగా.. 118 చోట్ల కాంగ్రెస్, 111 చోట్ల బీజేపీ పోటీ చేశాయి. భారతీయ జనతా పార్టీ మిత్రపక్షం జనసేన 8 స్థానాల్లో బరిలో నిలిచింది. సీపీఎం 19, సీపీఐ ఒకచోట, బీఎస్పీ నుంచి 108 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇతర పార్టీలు, స్వతంత్రులు పెద్ద సంఖ్యలో పోటీలో నిలిచారు. అత్యధికంగా ఎల్బీనగర్‌లో 48 మంది పోటీ చేస్తుండగా.. అత్యల్పంగా నారాయణపేట, బాన్సువాడల్లో కేవలం ఏడుగురు మాత్రమే బరిలో నిలిచారు.







## ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానానికి పోటీలో నిలిచిన వివిధ పార్టీల అభ్యర్థులు గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తన స్వగ్రామంలో వేల్పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునిల్ కుమార్ తన సతీమణి దీప్తి రెడ్డి,కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం సావెల్ లో ఓటు వేశారు. బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి కమ్మర్ పల్లి మండలం



చౌట్ పల్లి గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిని అభ్యర్థులు పరిశీలించారు.



## ప్రభుత్వ విధానాన్ని విమర్శించడం కాదు

- ఓటు ముఖ్యమని తెలుసుకోండి
- లేదంటే విమర్శించే అవకాశం రాదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఓటు హక్కు వినియోగించుకున్న కిషన్ రెడ్డి కుటుంబసభ్యులు

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**ప్రభుత్వ విధానాన్ని విమర్శించే ముందు ఓటు హక్కు ముఖ్యమైనదని, ఓటు వేయకుండా ఎవరిని విమర్శించే అవకాశం రాదనే విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం కాచిగూడలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ అద్భుతమైనదని, ఇతర దేశాలతో పోలిస్తే దేశంలో ఎన్నికలు గొప్పగా, పండుగలా జరుపుకుంటామని వివరించారు. తెలంగాణ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. ఓటు హక్కు విలువైనది, పవిత్రమైనదని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో రాజకీయాల్లోకి వచ్చి డబ్బు, మద్యం ప్రభావంతో ఓట్లను కొనాలని ప్రయత్నిస్తున్నారని, ప్రలోభాలకు లొంగకుండా ఐదేళ్ల భవిష్యత్తు ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. నచ్చిన వ్యక్తిని ఆలోచించి ఎన్నుకోవాలన్నారు. ఎవరికీ భయపడకుండా, బెదిరింపులకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేసిన తర్వాతే రోజు వారీ పనులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సమాజం మొత్తం స్పందించి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

## డిసెంబర్ 3న ప్రజల తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

పోతామని అన్నారు. మెజార్టీల పట్ల ఉన్న విధానమే మైనార్టీల పట్లు ఉంటుందని మాటిచ్చారు. తెలంగాణ గెలుపులో కాంగ్రెస్ అగ్రనాయకత్వానిది కీలకపాత్ర అని చెప్పారు. "అధికారాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగిస్తాం. ప్రజలకు మేము పాలకులం కాదు.. సేవకులం. ఈ తెలంగాణ కుటుంబానికి మొదటి, చివరి శత్రవు కేసీఆర్ కుటుంబంలోని ఆ నలుగురు మాత్రమే. మిగిలిన వాళ్లంతా మనవాళ్లే.. ఏదో విధిలేని పరిస్థితిలో అక్కడకు వెళ్లారు. సునామీ వచ్చినప్పుడు గడ్డపారలే కొట్టుకుపోతాయి.. ఇక గడ్డిపోచ ఎంత. సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి ప్రొఫెసర్ కోదండరామ్‌కు కీలక పదవి ఇవ్వబోతున్నాం." రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బీఆర్ఎస్ నేతలది మేకపోతు గాంభీర్యమని.. ప్రజలంటే వారికి చిన్నచూపు ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఈరోజు నుంచే సంబురాలు చేసుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం పోయేలా కేసీఆర్ వ్యవహరించారని ధ్వజమెత్తారు. పారదర్శక ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లో విపక్షాల అభిప్రాయాలకు విలువ ఉంటుందని వివరించారు. కేసీఆర్లాగా నిరంకుశంగా కాంగ్రెస్ నేతలు ఉండరన్నారు. ప్రజల సమస్యలు చూపించే మీడియాకు కూడా స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. మేం పాలకులుగా ఉండమని.. సేవకులుగా ఉంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబం ఇప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు.





















## మంచిర్యాల జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- ప్రజల తీర్పుపై ఉత్కంఠ
- ప్రత్యర్థుల గుండెల్లో గుబులు

**ఆదిలాబాద్, విశాలభారతి:**గత రెండు నెలలుగా కొనసాగిన ఎన్నికల ప్రచారం ముగియడంతో అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలలో గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఆ క్రమంలో చూస్తే.. జిల్లాలోని మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలొ ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లలో ఆ మూడు నియోజకవర్గాలలోని ఓటు హక్కు కలిగిన పౌరులు వాళ్ళ అమూల్యమైన ఓటును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్లో మధ్యాహ్నం వరకు 70 శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారుల ద్వారా తెలిసింది. ఉదయం నుంచి పోలింగ్ బూతుల వద్ద ప్రజలు బారులు తీరులై కనిపించారు. ముఖ్యంగా ప్రజల ఓట్లతో గెలిచే పార్టీ కన్నా ఓడిపోయే పార్టీ నాయకుల్లో ప్రజల తీర్పు ఏ విధంగా ఉంటుందో తమ భవిష్యత్తు ఏంటో అని విస్మయంతో కనిపించారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్,బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దుర్గం చిన్నయ్య,బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవి లు మంచిర్యాల కలెక్టర్ భదావత్ సంతోష్ దంపతులు సైతం జరిగిన ఎన్నికల పోలింగ్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఏది ఏమైనా కూడా ఓటర్లు పట్టుదలతో ఈ దఫా జరిగిన ఎన్నికలలో ఓట్లు వేసినట్లు తెలుస్తుంది.



## సాగర్ విషయంలో ఏపీ తీరు సరికాదు

- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు విషయంలో జోక్యం చేసుకోవాలి
- బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. నాగార్జున సాగర్ విషయంలో ఏపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదని.. అనుమతి లేకుండా గేట్లు ఎత్తి నీరు తీసుకెళ్లడం మంచి సంప్రదాయం కాదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆక్షేపించారు. ఏపీకి తాగు నీరిచ్చేందుకు అభ్యంతరం లేదన్న కేంద్రమంత్రి.. చర్చల ద్వారా ఇరు రాష్ట్రాలు సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. రాష్ట్రంలో పోలింగ్ ముగిసిన అనంతరం హైదరాబాద్లోని పార్టీ కార్యాలయంలో.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్, వైయస్ఆర్సీపీ కలిసి ఉద్రిక్తత పరిస్థితులు సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నకలవేళ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పెద్ద ఎత్తున డబ్బులు పంచాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు సజావుగా సాగాయని.. పోలింగ్లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొని.. విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS

vishalabharathi Telugu Daily

www.vishalabharathi.com
epaper:vishalabharathi.com

జనరల్ న్యూస్

































# ఓటేసిన రాజకీయ ప్రముఖులు..

తెలంగాణ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల పోలింగ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపు మినహా ప్రశాంతంగా కొనసాగింది. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావు, మల్లారెడ్డి, ఈటల రాజేందర్, రేవంత్ రెడ్డి, పలువురు రాజకీయ ప్రముఖులు ఉదయాన్నే పోలింగ్ బూత్‌లకు చేరుకుని తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కుటుంబ సమేతంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

















# ఓటేసిన సినీ ప్రముఖులు..

తెలంగాణ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల పోలింగ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగాయి. కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపు మినహా ప్రశాంతంగా కొనసాగింది. పలువురు సినీ ప్రముఖులు ఉదయాన్నే పోలింగ్ బూత్‌లకు చేరుకుని తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్, ఆయన భార్య ప్రణతి, తల్లి షాలిని, ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ జూబ్లీహిల్స్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు భార్య సురేఖ, కుమార్తె శ్రీజతో కలిసి వచ్చిన మెగాస్టార్ చిరంజీవి క్యూలో నిల్చుని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్‌లోనే ఎమ్మెల్సీ కవిత ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్సార్‌నగర్‌లోని నారాయణ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 188లో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కుటుంబ సమేతంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. హైదరాబాద్ లో సినీ ప్రముఖులు ఓటు వేయనున్న పోలింగ్ బూత్ ల వివరాలు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ నేపథ్యంలో నగర వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంది. పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. మరోవైపు సినీ ప్రముఖులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



















